# అల్లుడష్టమశని

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

కన్నకొడుకుపోయి విచారముతోనున్న కూతురు నొక్కసారి పుట్టినింటికి పంపుమని తల్లి రెండుసారులువెళ్లి అల్లుని బ్రతిమాలినది. మొదటిసారి సదుత్తరమే లేదు. మౌనమే. రెట్టించి యడగినచో ఆగ్రహరూపము. ఇది గని కూతురు మంచిమాటలాడి తల్లినిపంపివేసెను.

కడుపుతీపిచే అభిమానము చంపుకొని పతిలేనిసతియొక్క అలుసుతనమునకు విచారించుచు రెండవసారి అల్లుని బ్రతిమాల వెళ్లినది. ఈసారి యిప్పట్లో పంపుటకు వీలులేదు. నావంతు ఆస్తివ్రాసియిచ్చి, నీ పెద్దయల్లునికిపెట్టిన ఖర్చులన్ని లెక్కచూచి పంపిన మీకుమార్తెను పంపెదననెను. మగని కోపముచూచి కూతురు తల్లిని యూరడించి నాకొరకు విచారించవలదు. నేను సౌఖ్యముగా నుండుటే నీకు కావలసినదిగాన ఆయన కాగ్రహమురాకుండ వెడలిపొమ్మని తల్లిని బ్రతిమాలి పంపివైచెను.

దీనితో తల్లి నిరాశచేసుకొనెను. కాని మనసులో పిల్లకై మరుగుచునేయుండెను. ఇంతలో శ్రావణమాసమువచ్చెను. మంగళవారం నోముకైనా పంపుమని కార్డు వ్రాయించినది తల్లి. అష్టమశనిగా యేశుభగ్రహమువచ్చెనో కాని సరిగా మంగళవారం నాటికి పంపుచున్నానని జబాబువచ్చెను.

దీనితో తల్లి ఆకాశమంటి సంతసించెను. సోమవారంనాటికి ఇంటికి వెల్లలు, గడపలకు పసుపు కుంకుమలు, గుమ్మమునకు తోరణము, అన్ని సిద్ధపరచియుంచెను. రాత్రి శెనగలు నానబోసినది. తెల్లవారెను కాలకృత్యములు దీర్చికొని స్నానమాచరించి, పూజాసంబారములు సిద్ధపరచి, నివేదనకై పులగమువండి, చిన్నపిల్లచే పుష్పములు తెప్పించి, కూతురురాకకై నిరీక్షించుచుండెను. పండ్రెండుగంటలుకొట్టెను. జాడలేదు—ఒంటిగంట—రెండు పడవమీదవచ్చుననుటచే గోదావరితీరమున వేచియుంటతో, ఆతల్లి అలవికాని శ్రమపడెను.

ఇంతలో ఒకపడవ రేవుచేరెను. అపరాహ్ణముతిరుగుటచే ఆకలితో సకనకలాడు కడుపు బిగబట్టి అలసియున్నముఖముతో పదునెన్మిది వత్సరములయువతి దిగి తల్లి నాలింగనము చేసుకొని సంతసించెను. ఒకబండిచేసి కూతురునింటికి తీసుకొనివచ్చి వేగిరము తలంటి పూజచేయించెను. పూజానంతరము పేరంటముకై ముత్తైదువుల పిలిపించెను. వాయనములిప్పించి నోము పూర్తి చేయించెను.

రాత్రి పండ్రెండుగంటలవరకు తల్లి కూతుండ్రు, అక్కచెల్లెండ్రు కష్టసుఖముల చెప్పుకొనిరి. తదుపరి మెల్లిగా మరునాడే ప్రయాణమని కూతురు తల్లితో చెప్పెను. విచారావృతమేఘావరణముచే తల్లి మానసాకాశమందలి సంతోషవీచికలు మాయమై

విచారాంధకారము వ్యాపించెను. శుక్రవార మొక్కదిన ముండుమనియు, పూజ చేయించి మరునాడు పంపుదుమని బ్రతిమాలెను. ఉత్తరము వ్రాయిస్తాననెను టెలిఫోనులో చెప్పించెదననెను. దేనికిని మగని భయమో, భక్తియో కాని కూతురొక్కటే పట్టు. వచ్చేదాకా ఉబలాటము వచ్చింది మొదలు వెళ్లేవరకు ఆరాటము. మధ్య తల్లికి నక్కచావు. శ్రమ డబ్బుచేతిలోలేదు. ఎక్కడనో తెచ్చి, ఒకచీర రెండురవికెలు కొని, రోజంతయు శ్రమపడి చలిమిడిచేసి, మరునాడు పడవప్రయాణము ప్రయాసయని రైలుఖర్చులిచ్చి, పెదతండ్రినికూడ యిచ్చి పంపించెను.

కూతురున్న దొక్కరోజు ఆమెకై పడిన శ్రమ మూడురోజులు. పదిహేనురూపాయలుఖర్చు. అల్లుడేమనునోయని హడలు. కూతురునువిడచుటకు దుఃఖము. చివరకు నిరాశ, డబ్బుఖర్చు. అదియే అష్టమశని చేయు గ్రహస్థితి. ఇట్టిస్థితిని గల్పించు అల్లుడత్తవారి కష్టమశనిగాక శుభగ్రహ మగునా ?

అల్లుడనేసరికి వంకతాడి నిదానముగా నిలబడునని ఆర్యవచనము. అల్లుళ్ల అవగుణములు చెప్పబూనినచో భారతమంత గ్రంథ మవకమానదు. ఒక్కొక్కరీతిగా అత్తవారి కష్టమశనియే అల్లునిరూపమున ప్రాప్తించుచుండును. వెనుకగొయ్యి ముందు నుయ్యివలె యెటూచెప్పజాలక తల్లి, మగని మధ్యనలిగేది పిల్ల.

# ఈశ్వర

శ్రీమతి కొండపల్లి సుభద్రాంబగారు

ప్రభుకోటిదౌర్జన్య పరుతాచు పాలిత
వర్గరక్తముఁగ్రోలి ప్రబలువేళ,
చటుల దారిద్ర్య ఝంఝానిలార్భటి కర్ష
కాళియుబ్బూతలం దేలువేళ,
భారతావనిదాస్య బంధముల్సడలింప
హిందువు ల్ఘట్టి బిగించువేళ,
సామ్రాజ్యదుష్కాంక్ష సమరశతఘ్నికా
భీకరార్భటి విజృంభించువేళ,
సర్వమారకయంత్రాళి సంచయంబె
ఆధునిక రాజనీతియై యలరువేళ,
మలయవాసంత వీచికావళులతోడ
ఈశ్వరా! నీవు సాక్షాత్కరించినావె.

అనిశంబురాజిల్లు నగ్నికీలలదుష్ట
ప్రభుత దగ్ధమొనర్చి వైతువంచు,
సిగనుండుజాబిల్లిచే నమృతంబు వ
ర్షించి హాలికుల రక్షింతువంచు,
అసమానరక్ష నీ యభయహస్తంబుచే
హిందుజనాళి దీవింతువనుచు,
భవ్యమౌ డమరుకార్భటిచే శతఘ్నికా
ధ్వానముల్మ్రోయింప బూనెదంచు
చల్లనైన భాగీరథీ జలసమృద్ధి
యఖిలమారకయంత్రాగ్ని నార్పుదంచు,
పూజ్యనటరాజమూర్తివై ప్రోవుదంచు
ఈశ్వరా నీకు స్వాగతం బిచ్చుచుంటి.